క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ నేతకు పరామర్శ



సుబ్బారెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే, సీనియర్ నేత కేపీ కొండారెడ్డి

మార్కాపురం రూరల్: వైఎస్సార్ సీపీ నేత కర్రా సుబ్బారెడ్డిని శనివారం మాజీ ఎమ్మెల్యే, సీనియర్ నేత కేపీ కొండారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన సుబ్బారెడ్డి ఆరోగ్య పరిస్థితి గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

కిరణ్ రాజ్ కృషి ప్రశంసనీయం



కేక్ కట్ చేస్తున్న నాయకులు

పొదిలి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బందెల కిరణ్‌రాజ్ జన్మదిన వేడుకలు శనివారం స్థానిక దివ్యాంగుల విభాగం మండల శాఖ అధ్యక్షుడు ఆంజనేయులు ఆధ్వర్యంలో జరిగాయి. జిల్లా అధ్యక్షుడు కొండరాజు రమణయ్య వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేశారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం కిరణ్ రాజ్ చేస్తున్న కృషిని వారు ఈసందర్భంగా కొనియాడారు. దివ్యాంగుల విభాగం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రేపు సమాచార హక్కు చట్టంపై అవగాహన

బేస్తవారిపేట: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశం హాలులో ఈ నెల 23వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టం-2005పై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు వ్యవసాయాధికారి జక్కం మెర్సీ తెలిపారు. మండల స్థాయి అధికారులు, మండల వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు హాజరు కావాలని కోరారు. ఆర్‌టీఐ ఏపీ కమీషనర్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఉత్తర్వుల మేరకు సదస్సు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

దొనకొండ: ట్రాక్టర్ వేగంగా వెళ్తూ మోటార్ సైకిల్‌ను బలంగా ఢీకొట్టడంతో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని ఇండ్లచెరువు గ్రామం బ్రహ్మంగారి గుడి వద్ద శనివారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పత్తి వెంకటసుబ్బయ్య ట్రాక్టర్‌ను నడుపుకుంటూ పొలం పనుల కోసం వేగంగా వెళ్తున్నాడు. వ్యవసాయ పనులు ముగించుకుని గ్రామానికి చెందిన తమ్మనేని వెంకటేశ్వరరెడ్డి మోటార్ సైకిల్‌పై ఇంటికి వస్తున్నాడు. వేగంగా వెళ్తున్న ట్రాక్టర్.. మోటార్ సైకిల్‌ను ఢీకొనడంతో వెంకటేశ్వరరెడ్డి ట్రాక్టర్ టైర్ కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే మెరుగైన వైద్యం కోసం నరసరావుపేట తీసుకెళ్లారు.

విద్యుత్ సరఫరాలో మార్పులు

కురిచేడు: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని వ్యవసాయ బోర్లకు సంబంధించి గంటల విద్యుత్ సరఫరాలో మార్పులు చేసినట్లు ఏఈ సుబ్బారెడ్డి తెలిపారు. విద్యుత్ ఓవర్ లోడ్ కావడంతో నాలుగు రోజులుగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. వ్యవసాయ వినియోగదారుల విజ్ఞప్తి మేరకు విద్యుత్ సరఫరాలో మార్పులు చేసినట్లు చెప్పారు. మండలంలోని బోదనంపాడు ఫీడరు, కాటంవారిపల్లె, పడమరవీరయపాలెం ఫీడర్ల పరిధిలో అర్ధరాత్రి 2 గంటల నుంచి ఉదయం 11 గంటల వరకు, నమశ్శివాయపురం ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు, రాత్రి 9 గంటల నుంచి 11 గంటల వరకు సరఫరా చేస్తామని పేర్కొన్నారు.

గురజాడ అప్పారావుకు నివాళి



నివాళులర్పిస్తున్న గ్రంథపాలకుడు, విద్యార్థులు

పెద్దదోర్నాల: గురజాడ అప్పారావు జయంతి నిస్థానిక శాఖా గ్రంథాలయలంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథపాలకుడు సుబ్బారెడ్డి మాట్లాడుతూ బాల్య వివాహాలు, కన్యాశుల్కం తదితర సాంఘిక దురాచారాలను రూపు మాపిన గొప్ప సంస్కర్త అని కొనియాడారు. గురజాడ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. విద్యార్థులు పాల్గొన్నారు.

బూచేపల్లి సమర్థవంతమైన నాయకుడు

పీసీపల్లి: దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి సమర్థవంతమైన నాయకుడని, అందుకే పార్టీ జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించారని పార్టీ మండల అధ్యక్షుడు బొర్రారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ లక్ష్మీకాంతం ఓకేరెడ్డి, ఎంపీపీ అత్యాల జపన్య, సర్పంచులు, ఎంపీటీసీలు హర్షం వ్యక్తం చేశారు.

పాఠశాలల ఆయాల ఆకలి కేకలు

- ఏడు నెలలైనా అందని జీతాలు
- ఒక్క రోజు పాఠశాలకు రాకుంటే కంపే

కురిచేడు: రోజు వారీ కూలి పనికి వెళ్లినా కడుపునిండా అన్నం తినవచ్చు. ప్రభుత్వ పాఠశాలల్లో శానిటేషన్ ఆయాలుగా పనిచేస్తున్న వారి పరిస్థితి దయనీయంగా మారింది. గత ఫిబ్రవరి నుంచి నేటి వరకు వారికి జీతాలు చెల్లించక పోవడంతో పస్తులుంటూ కాలం వెళ్లదీస్తున్నారు. నెల మొత్తం పనిచేస్తే వారికి ఒక్కొక్కరికి రూ.6 వేల జీతం ఇస్తారు. జిల్లాలో 2,200 మంది ఆయాలు, 247 మంది నైట్‌వాచ్‌మెన్లు పనిచేస్తున్నారు. వీరందరికీ సర్వశిక్ష అభియాన్ ద్వారా జీతాలు చెల్లించాల్సి ఉంది. జిల్లాలోని 2,300 పైచిలుకు పాఠశాలలకు 200 మంది పిల్లలున్న పాఠశాలకు ఒక్కరు, 350 పైన పిల్లలున్న పాఠశాలలకు ఇద్దరు, 500 మంది పైచిలుకు విద్యార్థులున్న పాఠశాలలకు ముగ్గురు చొప్పున ఆయాలను నియమించారు. మండలంలో 56 మంది ఆయాలు, ఏడుగురు వాచ్‌మెన్లు పనిచేస్తున్నారు. వీరు వేరే పనులకు వెళ్లకుండా పాఠశాలలను నమ్ముకుని ,వచ్చే కొద్దిపాటి జీతంతో జీవనం సాగిస్తున్నారు. వారిపై కూడా ప్రభుత్వం కక్షసాధిస్తోంది. పిచ్చుక మీద బ్రహ్మాస్త్రంలా చిరుద్యోగులకు జీతాలు చెల్లించకుండా వారు పస్తు ఉంటుంటే వారికి చెల్లించాల్సిన డబ్బును ప్రభుత్వ ఖజానా నుంచి డ్రాచేసి ఇతర అవసరాలకు వినియోగించుకుంటున్నారు. ఇటీవల మంత్రి లోకేష్ వారి జీతాలు విడుదల చేసినట్లు ప్రకటించారు. యూనియన్ల నాయకులు సమస్యను పరిష్కరించామని ప్రకటించుకున్నా ఇంతవరకు వారి ఖాతాల్లో ఆ డబ్బులు జమ కాలేని ఆయాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కిరాణా సరుకులు అప్పులు ఇవ్వక, జీతాలు ఎప్పుడు వస్తాయో తెలియక ఒక పూట తిని ఒక పూట పస్తులుంటున్నట్లు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లోని ఆయాలకు, నైట్‌వాచ్‌మెన్‌లకు చెల్లించాల్సిన జీతాలు వెంటనే చెల్లించాలని కోరుతున్నారు.



కురిచేడు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల

కిరాణా సరుకులు అప్పు ఇవ్వడం లేదు:



కిరాణా షాపులో ఉన్న అప్పుతీర్చక పోవడంతో కొత్తగా అప్పు ఇవ్వడం లేదు. ఇంట్లో సరుకులు లేక ఇబ్బంది పడుతున్నాం. జీతాలు రాకపోవడంతో కుటుంబాన్ని పోషించుకోవటం కష్టంగా ఉంది. పచ్చడి మెతుకులు తిందామన్నా కూరగాయలు కొనేందుకు కూడా చిల్లర డబ్బులు లేక ఇబ్బంది పడుతున్నాం.

మక్కెళ్ల వెంకటలక్ష్మి, శానిటేషన్ ఆయా, కురిచేడు

తక్కువ జీతానికి ఒప్పుకున్నా ఫలితం లేదు:



బయట కూలి పనులు చేయలేక తక్కువైనా సర్దుకుపోతున్నాం. 7 నెలల నుంచి ఎదురు చూస్తున్నా మమ్మల్ని పట్టించుకున్న వారు లేరు. మూడు పూటలా తిందామన్నా సరుకులు నిండుకోవటంతో చేసేది లేక ఇబ్బందులు పడుతున్నాం . తెలిసిన వారు కూడా అప్పులు ఇవ్వడం లేదు. కనీసం సరుకులైనా ప్రతి నెలా ఇప్పిస్తే జీతాలు ఆలస్యమైనా ఇబ్బంది లేకుండా ఉంటుంది.

బూదాల కోటేశ్వరమ్మ,శానిటేషన్ ఆయా, కురిచేడు



బూచేపల్లికి అభినందనలు చెబుతున్న మండల కన్వీనర్, వైఎస్సార్ సీపీ నాయకులు

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లికి అభినందనలు

దర్శి: వైఎస్సార్ సీపీ జిల్లా నూతన అధ్యక్షుడిగా ఎంపికైన దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డికి దర్శి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పూలమాలతో ఘనంగా సత్కరించారు. అభినందనలు తెలిపిన వారిలో దర్శి మండల పార్టీ అధ్యక్షుడు వెన్నపూస వెంకటరెడ్డి, రాష్ట్ర గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ మాజీ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, జేసీఎస్ మండల మాజీ కన్వీనర్లు బత్తినేని వెంకటేశ్వర్లు, మేడికొండ జయంతి, ఏఎంసీ మాజీ చైర్మన్ షేక్ షకీలాఅమీన్‌బాషా, తాళ్లూరు మాజీ ఎంపీపీ పోశం మధుసూదన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు కేసరి రాంభూపాల్‌రెడ్డి, కౌన్సిలర్ మేడగం మోహనరెడ్డి, సర్పంచ్‌ల సంఘ మండల మాజీ అధ్యక్షుడు చింతలపూడి శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

దొనకొండ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డికి మండల మాజీ కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా యూత్ అధ్యక్షుడు గొంగటి శ్రీకాంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కర్నాటి ఆంజనేయరెడ్డి అభినందనలు తెలిపారు. దొనకొండ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, అభిమానులు ఆనందోత్సాహాలతో మునిగిపోయారు. బూచేపల్లి కుటుంబం 2004 నుంచి నేటి వరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి కుటుంబం వెంటనే ఉన్నారని, ఆ నమ్మకంతో బూచేపల్లి శివప్రసాదరెడ్డికి జిల్లా అధ్యక్ష బాధ్యతలు లభించిందన్నారు. ప్రతి కార్యకర్త శివప్రసాదరెడ్డికి అండగా ఉంటూ ఆయన సేవా కార్యక్రమంలో పాల్గొంటామని కృష్ణారెడ్డి వ్యక్తం చేశారు.



గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ మాజీ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు

చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్



కబడ్డీ పోటీలో తలపడుతున్న విద్యార్థులు



ఆటల పోటీలు ప్రారంభిస్తున్న హెచ్‌ఎం

ముండ్లమూరు (దర్శి): విద్యార్థులు చదువుతో పాటు ఆటల పోటీల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని హెచ్‌ఎం శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని ఉమామహేశ్వరపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మండల స్థాయి ఆటల పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలు గ్రామీణ ప్రాంత పాఠశాలలో ప్రారంభించడం విద్యార్థులకు అవకాశాలు కల్పించడమేనన్నారు. ఈ అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని తమ సత్తా చాటాలన్నారు. అనంతరం కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ ఆటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులను అభినందించారు. మండల స్థాయి ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు నియోజకవర్గ స్థాయిలో ఏర్పాటు చేసే పోటీల్లో పాల్గొని మండలానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో హెచ్‌ఎంలు మాధవీలత, మండల కో ఆర్డినేటర్ భవన్నారాయణ, పీఈటీలు కోటేశ్వరరావు, రాముడు, తిరుపతిస్వామి, సుజాత పాల్గొన్నారు.

నాగిరెడ్డికి జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ నివాళి

తాళ్లూరు (దర్శి): మండలంలోని బొద్దికూరపాడు గ్రామానికి చెందిన పులి నాగిరెడ్డి (95) అకాల మరణం చెందారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మకు పులి నాగిరెడ్డి బాబాయి. సమాచారం తెలుసుకున్న ఆమె గ్రామానికి చేరుకొని నాగిరెడ్డి మృతదేహం వద్ద పూలమాలలతో నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆమె వెంట పులి రమణారెడ్డి, పులి బ్రహ్మారెడ్డి, మాజీ సర్పంచ్ పులి వెంకటకృష్ణారెడ్డి, ఎంపీటీసీ కొప్పుల బాలకోటయ్య, నాయకులు మందా ఏసేబు, కొప్పుల శ్రీనివాసరావు, మద్దాలి గాలియ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.



నాగిరెడ్డికి నివాళులర్పిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ

బాదాపురంలో పౌష్టిక వారోత్సవాలు

దొనకొండ: మండలంలోని బాదాపురం 1, 2 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ సుభాషిణి ఆధ్వర్యంలో శనివారం పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ స్థానికంగా దొరికే మునగాకులో ఎక్కువ పోషక విలువలు ఉంటాయని తెలిపారు. బాలింతలు, గర్భిణులు పోషకాహారం కలిగిన ఆహారం తీసుకుంటే మంచి ఆరోగ్యం ఉంటుందని చెప్పారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్ ఇన్నాసమ్మ, పి.రూతు, ఏఎన్‌ఎం ఇందిరాదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు నర్సమ్మ, కుమారి పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

విద్యార్థులకు కంటి పరీక్షలు

దర్శి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రకాశం జిల్లా అంధత్వ నివారణా సంస్థ ఆధ్వర్యంలో శనివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకు పాఠశాలలో విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు హెల్త్ సూపర్‌వైజర్ రమణమ్మ తెలిపారు. విద్యార్థులకు పరీక్షలు నిర్వహించిన అనంతరం అవసరమైన వారికి కంటి అద్దాలు, మందులు పంపిణీ చేస్తామని చెప్పారు. శస్త్రచికిత్సలు అవసరమైన వారిని శంకర్ కంటి వైద్యశాల, ఒంగోలు రిమ్స్‌కు రిఫర్ చేస్తామని స్పష్టం చేశారు. ఆప్తాల్మిక్ ఆఫీసర్లు హెరాల్డ్, గురుస్వామి, ప్రిన్సిపాల్ రాజశేఖర్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఆలయాల్లో భక్తుల సందడి



ప్రత్యేక అలంకారంలో దర్శనమిస్తున్న వెంకటేశ్వరస్వామి



అలంకరణలో శ్రీవారి ఉత్సవమూర్తులు

కొనకనమిట్ల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వెలుగొండ వెంకటేశ్వరస్వామి ఆలయం, రేగడపల్లి వెంకటేశ్వర స్వామి, పోలేరమ్మతల్లి ఆలయాల్లో, కొనకనమిట్ల రామ దూతక్షేత్రంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. నమో వేంకటేశాయా నమోనమః అంటూ భక్తులు స్వామివారిని దర్శించుకుని పరవశించారు. శ్రీవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు తిరుమలాచార్యులు శ్రీలక్ష్మీ అలివేలుమంగా వెలుగొండ వెంకటేశ్వరస్వామి వార్లను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామం వెంకటేశ్వరస్వామి ఆలయం, పోలేరమ్మతల్లి ఆలయాల్లో గోవిందా.. గోవిందా అంటూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు అర్చనలు, అభిషేకాలు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు విజయకాంత్ శర్మ భూదేవి, శ్రీదేవి సమేత వెంకటేశ్వరస్వామి, పోలేరమ్మతల్లిని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

మార్కాపురం టౌన్: పట్టణంలో వెలిసిన శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీ లక్ష్మి చెన్నకేశవస్వామివారికి శనివారం ప్రత్యేక శాంతి పూజలు అర్చకులు నిర్వహించారు. చెన్నకేశవస్వామి మూలవిరాట్‌కు ఆలయ అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు, అర్చక బృందం అభిషేకాలు, అర్చన తదితర పూజలను నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి, ఆలయ సిబ్బంది కోటిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



రేగడపల్లిలో శ్రీవారిని దర్శించుకుంటున్న భక్తులు

ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో..

పట్టణంలోని కంభం రోడ్డులోని శ్రీ ప్రసన్నవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు అర్చకులు చేశారు. శనివారం సందర్భంగా స్వామివారిని ప్రత్యేక పూలతో సుందరంగా అలంకరించారు. భక్తులకు తీర్థప్రసాదాలు ఆలయ కమిటీ సభ్యులు అందజేశారు.

ఘనంగా ముగిసిన ఎస్‌జీఎఫ్‌ఐ క్రీడలు

మార్కాపురం రూరల్: విద్యార్థుల్లో విద్యతో పాటు క్రీడా స్ఫూర్తిని పెంచాలని గజ్జలకొండ జెడ్పీహెచ్ పాఠశాల హెచ్‌ఎం దొడ్డ రామాంజనేయరెడ్డి అన్నారు. మండలంలోని గజ్జలకొండ జెడ్పీ హైస్కూల్‌లో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మండల స్థాయి క్రీడా పోటీలు 21వ తేదీతో ఘనంగా ముగిశాయి. 19, 20వ తేదీల్లో అథ్లెటిక్స్, చెస్, యోగ విభాగంలో పోటీలు నిర్వహించారు. శనివారం కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ క్రీడల్లో విద్యార్థులు పాల్గొని ఆటలు ఆడారు. ఆయా క్రీడల్లో విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారని మండల కోఆర్డినేటర్ బాబురావు అన్నారు. అనంతరం ఎస్‌జీఎఫ్ఐ క్రీడల ముగింపు కార్యక్రమం నిర్వహించారు.

దివ్యాంగులకు ఇంటి వద్ద విద్య

మార్కాపురం: దివ్యాంగులకు ప్రభుత్వం అండగా ఉంటుందని జిల్లా సహిత విద్యా సమన్వయకర్త ఎం. రమేష్ అన్నారు. ఇంటివద్దనే విద్య కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. శనివారం పట్టణంలోని కంభంరోడ్డు శివాజీనగర్ 9వ లైన్‌లో విద్యాంగులకు ఇంటి వద్ద నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని పరిశీలించారు. దివ్యాంగులకు ఉచితంగా ఫిజియోథెరపీ నిర్వహించాలని ఐఈఆర్‌టీలకు సూచించారు. దివ్యాంగులకు ప్రత్యేక విద్యను భవిత కేంద్రాల నిర్వహిస్తారని తెలిపారు. ప్రభుత్వం వివిధ రకాల అలవెన్సులు, పరికరాలు అందిస్తుందని వాటిని సద్వినియోగంచేసుకోవాలని కోరారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం

ముండ్లమూరు (దర్శి): ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు ప్రబలకుండా చూడొచ్చని హెచ్‌ఎం గోగుల కోటేశ్వరరావు తెలిపారు. మండలంలోని భట్లపల్లి ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉన్న వ్యర్థాలను తొలగించారు. పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్వచ్ఛ భారత్ సాధనలో మనతో పాటు మన కుటుంబ సభ్యులను భాగస్వాములను చేయాలని సూచించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి స్వర్ణలత, ఆశా కార్యకర్త అంజమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.



భట్లపల్లిలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, హెచ్‌ఎం

దూర విద్యను సద్వినియోగం చేసుకోవాలి

కంభం: దూర విద్యను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ శివకుమార్ తెలిపారు. శనివారం స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో అడ్మిషన్ల ప్రక్రియ, పరీక్ష కేంద్రాల ఎంపిక, నిర్వహణపై ఓపెన్ స్కూల్ నిర్వాహకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. చదువు మధ్యలో ఆపిన వారు మళ్లీ చదువును కొనసాగించేందుకు దూర విద్యావిధానం చక్కటి అవకాశమన్నారు. ఈ సదావకాశాన్ని మహిళలు, ప్రజాప్రతినిధులు, వృత్తి వ్యాపారాల్లో ఉన్న వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చదవడం, రాయడం వచ్చిన ప్రతి ఒక్కరూ పదో తరగతి పూర్తి చేయవచ్చని తెలిపారు. అనంతరం కరపత్రాలను పట్టణంలో స్టడీ సెంటర్లలో , పాఠశాలల్లో అతికించే కార్యక్రమం చేపట్టారు. ఎంఈఓ మాల్యాద్రి పాల్గొన్నారు.



సీఎల్‌ఆర్ కళాశాలలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అధికారులు

చిరు వ్యాపారులపై టీడీపీ నేతలు దౌర్జన్యం



రేకుల షెడ్డు వద్దకు వచ్చి పరిశీలిస్తున్న పోలీసులు

బేస్తవారిపేట: అర్ధవీడు మండలంలోని మొహిద్దీన్‌పురంలో ఈర్ల లింగమ్మ అనే చిరు వ్యాపారస్తురులపై గ్రామ టీడీపీ నాయకులు కక్ష కట్టారు. 50 ఏళ్ల క్రితం తన నివాసం పక్కనే ఉన్న గ్రామకంఠం స్థలాన్ని కుటుంబ సభ్యులు కొనుగోలు చేశారు. పూర్వం నుంచే బంకు పెట్టుకుని టీకొట్టు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే బంకు పాతబడి చెక్కలు ఊడిపోవడంతో కొత్తది ఏర్పాటు చేసుకునేందుకు చర్యలు చేపట్టారు. రేకులు వేసుకుని చుట్టూ గోడ కట్టుకునే సమయంలో టీడీపీకి ఓటేయ్యలేదని అడ్డుకుంటున్నారు. ఈ స్థలంలో ఎన్టీఆర్ విగ్రహం పెట్టాలనే సాకుతో అధికారాన్ని ఉపయోగించి నానా ఇబ్బందులు గురి చేస్తున్నారు. రెవెన్యూ, పోలీసులతో ఒత్తిడి తీసుకొచ్చి జీవనోపాధి లేకుండా చేసేందుకు కుట్రలు చేస్తున్నారని బాధితురాలు కుటుంబం తీవ్ర ఆవేదనను వ్యక్తం చేస్తోంది.